క్లుప్తంగా

కలసికట్టుగా పనిచేస్తాం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో కలసి కట్టుగా పనిచేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేవాయిపల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఎవరికి బీఫాం ఇచ్చినా వారితో కలసి పనిచేస్తామన్నారు. పార్టీ తరఫున నిలబడే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. నాయకులు మహేందర్‌రెడ్డి, షౌకత్‌అలీ, శ్యాంరావు, రాంచంద్రం, వెంకట్‌రెడ్డి, రూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని బేగంపూర్ చౌరస్తా 161 జాతీయ రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసు సిబ్బంది మాట్లాడుతూ.. ఎవరైన నిషేధిత వస్తువులను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాదారులు తమ వద్ద వాహనాల పత్రాలను కలిగి ఉండాలని తెలిపారు. సిబ్బంది జమీందార్ సత్తయ్య, వేంకటేశ్వర్లు, జైపాల్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలం కోర్పోల్ గ్రామానికి చెందిన గాండ్ల నర్సింలు క్యాసంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయన 'వెలుగుల వేకువ' అనే పద్య సంపుటిని రచించగా, ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో భవాని సాహిత్య వేదిక కరీంనగర్, చౌడూరి కళాపీఠం సంయుక్తంగా నిర్వహించిన సభలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. వేదిక అధ్యక్షుడు వైరాగ్య ప్రభాకర్, కాంచనపల్లి గోవర్ధనరాజు, సురవరం ప్రతాపరెడ్డి, చౌడూరి కళాపీఠం అధ్యక్షుడు నరసింహరావు, సాధనాల వెంకట స్వామినాయుడు, సినీగేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, పసుపులేటి నరేంద్రకృష్ణ, వైఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన హైకోర్టు న్యాయవాది మోహిన్ అహ్మద్ ఖాద్రీ సతీమణి హిస్రత్‌ఖాద్రీ ఆదివారం గ్రామంలోని తన నివాసంలో 200 మంది మహిళలకు చీరలు, నగదు వితరణ చేశారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు చీరతో పాటు నగదును అందజేసినట్లు ఆమె తెలిపారు. కుటుంబ సభ్యులు మెహెర్ ఉన్నిసాబేగం పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బెజుగం చెరువుతండాకు వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతింది. దీంతో వారంరోజులకుపైగా తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. వరదలతో దెబ్బతిన్న రోడ్డును పంచాయతీరాజ్ ఏఈ పిచ్చయ్య ఇటీవల తండావాసులతో కలిసి పరిశీలించారు. ఆదివారం తండావాసుల సహకారంతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నస్రుల్లాబాద్: మండలంలోని నాచుపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్వర రావు కుమారుడు రాజశేఖర్, మాజీ సర్పంచ్ సాయిలు సోదరుడి కూతురు సుజాత, కామిశెట్టిపల్లి గ్రామ సీనియర్ నాయకులు రఘునాథ్ కొన్ని రోజుల క్రితం మరణించారు. దీంతో బాధిత కుటుంబాలను ఆదివారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. నాయకులు పెర్క శ్రీనివాస్, మంగలి సాయిలు, మాజీద్, ప్రతాప్ సింగ్ తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా నిఘా నేత్రం

- పెద్దకొడప్‌గల్ మండలంలోని పలు గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- నిర్వహణ చూసేవారు కరువు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. వాటిని పట్టించుకునే వారు కరువవడంతో, నిర్వహణ సరిగా లేక పాడైపోయాయి. దీంతో కేసుల ఛేదనలో ఎంతో ముఖ్యమైన సీసీకెమెరాలు పనిచేయకపోవడంతో పోలీసులకు ఇబ్బందిగా మారింది. అలాగే గ్రామాల్లో ఏదైన ఘటనలు చోటుచేసుకుంటే నిందితులను గుర్తించడం కష్టమవుతుంది.

గ్రామాల్లో పాలకవర్గాలు లేక..

గతంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యాన్ని పోలీసులు అవగాహన కల్పించారు. దీంతో పలు గ్రామాల్లో స్థానిక నాయకులు, వ్యాపారులు, యువత స్వచ్ఛందంగా ముందుకువచ్చి గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. మండలంలోని వడ్లం, కాస్లాబాద్, అంజని పోచారం తండా, బేగంపూర్, కాటేపల్లి, కుబ్యానాయక్ తండా, పెద్దదేవిసింగ్ తండా, చిన్నదేవిసింగ్ తండా, సముందర్ తండా, బురుగు పల్లి, విఠల్ వాడి తండా, లింగంపల్లి, చిన్న తక్కడ్‌పల్లి, శివాపూర్ తదితర గ్రామల్లో మొత్తం 84 సీసీ కెమెరాలను మూడేళ్ల క్రితం దాతలు ఏర్పాటు చేయించారు. గ్రామ పాలకవర్గాల పదవికాలంలో వాటి నిర్వహణను పాలకులు పట్టించుకున్నారు. ప్రస్తుతం సర్పంచ్‌లు లేక ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది. దీంతో సీసీ కెమెరాల నిర్వహణకు పంచాయతీల నుంచి నిధులు ఇవ్వలేమంటూ అధికారులు వాటి నిర్వహణను గాలికొదిలేశారు.



కాటేపల్లి గ్రామంలో పనిచేయని సీసీ కెమెరాలు

కష్టమవుతున్న కేసుల ఛేదన..

గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నేరాలు పెరిగిపోతున్నాయి. సీసీ కెమెరాలు లేకపోవటంలో నిందితులను గుర్తించడం పోలీసులకు కష్టంగా మారింది. మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో ఇటీవల ట్రాక్టర్ దొంగలించబడింది. సీసీ కెమెరాలు లేని కారణంగా దొంగలను పట్టుకోవడం పోలీసులకు కత్తిమీదసాములా మారింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సీసీకెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పోచారం తండాలో..

తగిన చర్యలు తీసుకుంటాం..

సీసీ కెమెరాల నిర్వహణను గతంలో సర్పంచ్‌లు చూసుకునేవారు. ప్రస్తుతం కొన్నిచోట్ల సీసీ కెమెరాల పనితీరు సరిగ్గా లేదు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పలుచోట్ల మొరాయించినట్లు మా దృష్టికి వచ్చింది. వాటి నిర్వహణ కోసం తగిన చర్యలు తీసుకుంటాం.

–అరుణ్ కుమార్, ఎస్సై, పెద్దకొడప్‌గల్

గుంతలమయంగా రహదారి

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ గ్రామంలోకి వెళ్ళే రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డుపై గల గుంతల్లో నీళ్ల చేరి కాల్వలను తలపిస్తున్నాయి. సమస్యను అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చుక్కాపూర్ రోడ్డుపై గల గుంతల్లో నిలిచిన నీరు

ఆర్‌యూబీలో నిలిచిన నీరు



రాజంపేట: మండలం శివాయిపల్లి గ్రామ శివారులోని రైల్వే అండర్‌బ్రిడ్జిలో వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో అండర్‌బ్రిడ్జిలో భారీగా వర్షపు నీరు వచ్చి చేరుతుంది. దీంతో బ్రిడ్జి నుంచి వాహనదారులు వెళ్లడానికి జంకుతున్నారు. వెళ్లిన వాహనాల ఇంజిన్‌లోకి నీరు పోవడంతో వాహనాలు మధ్యలోనే నిలిచిపోతున్నాయి. బ్రిడ్జి నుంచి నీరు బయటకు వెళ్లే దారి సరిగాలేకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటమునిగిన రోడ్డు

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంతోపాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండడంతో లెండి వాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో మండలంలోని చిన్న టాక్లీ, పెద్ద టాక్లీకి వెళ్లే రహదారిపై గల లోలెవల్ వంతెన పైనుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆదివారం రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో అధికారులు రహదారిని మూసివేశారు. వరద తగ్గే వరకు అటువైపు ఎవరు వెళ్లరాదని డోంగ్లీ ఆర్ఐ సాయిబాబా సూచించారు. నిండుగా పారుతున్న వాగును ఆయన పరిశీలించారు.



సంక్షిప్తం

భద్రాచలం వెళ్లిన ఆదివాసి నాయక్‌పోడ్‌లు



నిజాంసాగర్(జుక్కల్): భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన 'హలో ఆదివాసి.. చలో భద్రాచలం' బహిరంగ సభకు జిల్లా ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం నాయకులు తరలి వెళ్లారు. ఎస్టీ జాబితాలో అక్రమంగా చొరబడిన లంబాడాలను తొలగించాలని ఆదివాసినాయక్‌పోడ్ జిల్లా అధ్యక్షుడు పెంటయ్య డిమాండ్ చేశారు. నాయకులు జముల శంకర్, సాయిబాబా, కాశీరాం, కందిసాయిలు, రవీందర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రెండు మండలాలకు రూ.50లక్షల నిధులు



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లో పలు అభివృద్ధి పనుల కోసం జహీరాబాద్ ఎంపీ రూ. 50లక్షల నిధులు మంజూరు చేసినట్లు మాజీ జెడ్పీటీసీ జయప్రదీప్ తెలిపారు. మాగి గ్రామంలోని తన నివాసంలో ఆదివారం ఆయన మాట్లాడారు. నిధులు మంజూరు చేసిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ బత్తుల నాగరాజు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, కొన్ని రోజులుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో ఆదివారం భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వర ట్రాలీఆటో యూనియన్ ఆధ్వర్యంలో రూ.21వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. అలాగే రామాయంపేటలోని శ్రీ లక్ష్మిరైస్‌మిల్లు యాజమాన్యం 25 కిలోల బియ్యం అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పలు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. నాయకులు నాగిరెడ్డి, మోహన్, సంజీవ్, మల్లప్ప పటేల్, గంగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేదాల ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని జిల్లా యోగా భవన్‌లో ఆదివారం నాలుగు వేదాలను ఆవిష్కరించారు. దాత గంజి అంజనేయులు సహకారంతో రూ.25వేల వ్యయంతో రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలను కొనుగోలు చేశారు. ఈ వేదాలను ఎవరైన పఠించవచ్చని యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యోగా రాంరెడ్డి అన్నారు. రఘుకుమార్, సత్యమిత్ర ఆర్య, అంజయ్యగుప్తా, అంతిరెడ్డి, అనిల్‌రెడ్డి, సురేష్, రమేష్, నర్సింలు, వెంకటేశం పాల్గొన్నారు.

రిజర్వేషన్లను అడ్డుకోవద్దు

మాచారెడ్డి: బీసీలకు ఇచ్చిన 42శాతం రిజర్వేషన్లను అడ్డుకోవడం ఓసీలకు తగదని బీసీ సంఘాల మండల కన్వీనర్ రావుల ప్రభాకర్ ఒక ప్రకటనలో అన్నారు. 42శాతం రిజర్వేషన్లు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డికి బీసీలు రుణపడి ఉంటారని తెలిపారు. బీసీ రిజర్వేషన్లను సవాల్ చేస్తూ కోర్టుకు వెళ్లడం సబబు కాదన్నారు. ఓసీలకు ఈడబ్ల్యూఎస్ ఇచ్చినప్పుడు మేమేమైనా ఆక్షేపించామా అంటూ ప్రశ్నించారు. బీసీలు ఏకమైతే ఓసీలు తట్టుకోలేరని హెచ్చరించారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లిలో ఆదివారం స్వదేశీ జాగరణ్ మంచ్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని భగత్‌సింగ్ విగ్రహానికి సంస్థ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సంస్థ ప్రతినిధులు రాహుల్, వడ్ల వెంకటస్వామి, కుసుమ సిద్ధిరాములు, శంకర్, రమేష్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలో అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ ఆర్ఎస్ఎస్



పిట్లంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు



కృష్ణాజీవాడిలో..

పిట్లం(జుక్కల్): ప్రపంచంలో అతి పెద్ద స్వచ్ఛంద సేవ, జాతీయవాద సంస్థ ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) అని సంఘ ప్రధాన వక్త నిరంజన్ అన్నారు. మండలకేంద్రంలోని సాయిగార్డెన్స్‌లో ఆదివారం ఆర్ఎస్ఎస్, శివాజీ శాఖ ఆధ్వర్యంలో సంఘ్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు దుర్గామాతా, శస్త్ర పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్వయం సేవక్‌లు, మాతలు, వచ్చిన హిందూబంధువులందరు భగవాధ్వజానికి ధ్వజ ప్రణామ్ చేశారు. స్వయం సేవక్‌లు వ్యాయం యోగ్, ఆసన్ ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా ప్రధాన వక్త నిరంజన్ మాట్లాడుతూ.. హిందూ సంఘటనే లక్ష్యంగా 1925లో విజయ దశమి రోజు నాగపూర్ పట్టణంలో డాక్టర్ హెడ్గేవర్ ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారన్నారు. ప్రతీ స్వయం సేవక్, హిందూ బంధువులు అందరూ సంఘం కోసం సమయం ఇచ్చి పని చేయాలని కోరారు. సంఘ్ వివిధ విభాగాల ప్రతినిధులు కోట రాజులు, ఉడుగుల రాము, రాజగిరి మహేష్, కుమ్మరి జితేందర్, పద్మ సంతోష్, కృష్ణ ప్రసాద్, గొల్ల కృష్ణ, అశోక్, రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కృష్ణాజీవాడి గ్రామంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యకారిని సాయినాథ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు దేశభక్తి కలిగిఉండాలని, అందరం సంఘటితంగా ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు.

అసంపూర్తిగా రోడ్డు మరమ్మతులు

గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి–బాన్సువాడ ప్రధాన రహదారి గత రెండేళ్లుగా గుంతలు పడి అధ్వానంగా మారింది. అధికారులు ఇటీవల గుంతల్లో కంకర వేసి మరమ్మతులు చేశారు. అయితే మరమ్మతుల్లో రోడ్డుపై ఉన్న మొత్తం గుంతలు పూడ్చలేదు. ఒకే చోట రెండుమూడు గుంతలుంటే ఒక గుంతను నామ మాత్రంగా పూడ్చి మిగతా గుంతలను వదిలేశారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. గాంధారి–పోగంల్ ఖుర్దు గ్రామాల మధ్యలో తిమ్మాపూర్ ప్రాంతంలో మొత్తం గుంతలను పూడ్చకుండా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై గుంతల వద్ద అరకొరగా వేసిన కంకర

చెక్‌బౌన్స్ కేసు నమోదు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేటకు చెందిన ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకరిపై చెక్‌బౌన్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని గోపాల్‌పేటకు చెందిన మొగల్ బాబు గ్రానైట్ కట్టింగ్ పనులు చేస్తాడు. గతయేడు అతను పనుల నిమిత్తం తూప్రాన్ వెళ్లాడు. అక్కడ అతడికి తూప్రాన్ సమీపంలోని యావపూర్ గ్రామానికి చెందిన కుతాడి నర్సింలుతో పరిచయం ఏర్పడింది. సుమారు ఆరునెలల క్రితం నర్సింలు తన ఇంట్లో గోతులు తవ్వే క్రమంలో బంగారు బిస్కెట్ దొరికిందని, 223 గ్రాముల బంగారు బిస్కెట్‌ను రూ.3లక్షలకు బాబుకు విక్రయించాడు. కానీ కొన్నిరోజుల తర్వాత తాను తీసుకున్న బంగారు బిస్కెట్ పిత్తలతో తయారుచేసిందని, తాను మోసపోయినట్లు గ్రహించి బాబు డబ్బుల కోసం నర్సింలు ఇంటికి వెళ్లాడు. దీంతో నర్సింలు రూ.లక్షా40వేలు బాబుకు ఇచ్చి మిగిలిన రూ.లక్షా60వేల కోసం చెక్కు ఇచ్చాడు. కానీ చెక్కు బౌన్స్ కావడంతో బాబు ఆదివారం నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో నర్సింలుపై ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

దుర్గామాత నమోస్తుతే...



దోమకొండలో బోనాలు తీసుకువస్తున్న మహిళలు



మద్నూర్‌లో అన్నదానంలో పాల్గొన్న భక్తులు



ఎల్లారెడ్డిలో అమ్మవారికి సమర్పించిన 56 రకాల నైవేద్యాలు



కామారెడ్డిలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు



కిచ్చన్నపేటలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆదివారం వివిధ ప్రాంతాల్లో అమ్మవారిని మహాలక్ష్మిగా, కాత్యాయని దేవిగా, సరస్వతి దేవిగా అలంకరించారు. జిల్లాకేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లోని దేవి మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పలు మండపాల్లో నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. బాన్సువాడ సరస్వతి దేవి ఆలయంలో అమ్మవారిని రూ.5లక్షల కరెన్సీలతో అలంకరించారు. ఎల్లారెడ్డిలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి 56 రకాల నైవేద్యాలను భక్తులు సమర్పించారు. పలు గ్రామాల్లో బోనాల ఊరేగింపు నిర్వహించారు.



ఎల్లారెడ్డిలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



సదాశివనగర్‌లో..



పోసానిపేటలో..



బాన్సువాడలో కరెన్సీ అలంకరణలో అమ్మవారు



మహ్మద్‌నగర్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న మాజీ జెడ్పీచైర్మన్ దఫేదార్ రాజు



తాడ్వాయిలో పూజలు చేస్తున్న స్వాములు, భక్తులు



భిక్కనూరులో..



కామారెడ్డి పట్టణంలో..



లింగంపేటలో..

కోతకు గురైన తాత్కాలిక వంతెన రోడ్డు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి పాముల వాగు వంతెన వద్ద భారీ వర్షాలకు తాత్కాలిక రోడ్డు కోతకు గురైంది. గత నెల భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో వంతెనకు ఇరువైపులా రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో అధికారులు తాత్కాలికంగా మొరం వేసి రాకపోకలు పునరుద్ధరించారు. కానీ మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి తాత్కాలిక రోడ్డు కోతకు గురవుతుండడంతో ప్రమాదకరంగా మారింది. తాత్కాలిక వంతెన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. కోటి నిధులు మంజూరు చేసింది. తరుచూ వర్షాలు కురుస్తుండడంతో పనులు సాగడంలేదు. అధికారులు స్పందించి తాత్కాలిక వంతెన నిర్మాణం వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.